
# తేనె

-మాదిరాజు విజయానందకృష్ణ

''తేనేండీ ... తేనె''

సుపరిచితమైన గొంతు వీధి మొగలో.

కాసేపటికి మా యింటి ముందుకి వచ్చాడు ముసలాడు. ''తేనె తీసు కుంటారా అమ్మా'' విలక్షణమైన



విరుపు, డెబ్బై ఏళ్ళ వృద్ధాప్యపు వణుకుతో, జీరతో ...

ఆ గొంతు వినడం నా కిష్టం ఎందుకో గానీ.

మా యింట్లో తేనె వాడుతు ంటాం తరచుగా. అందుకనే వాడదుగుత.

ఒక తేనె సీసా తీసుకుని డబ్బులిచ్చి పంపేశావాణ్ణి.

ఏడెనిమిది నెలలు గడిచి వుంటాయి ...

నే నెన్నో సాయంత్రాలు నిరాశను ఎదుర్కోవాల్సి వచ్చింది ఈ లోగా. పరిచితమైన కేకా, అందులో విలక్షణమైన విరుపూ, వృద్ధాప్యపు వణుకూ, జీరా ... వినపడ్డం లేదీమధ్య. ఏదో వెలితిగా, అశాంతిగా వుంది.

> తల్లి ప్రేమ తేనె సోన కన్న కొడుకు విదిలింపుకు గురియై తాను ఆకలికి అల్లాడుతున్నా, ఎవరో ఇచ్చిన పప్పన్నం బిడ్డకి పెట్టక తిన లేని అమ్మ ప్రేమ వెన్నెల వాన!

మళ్ళీ ఆ రోజు ... సుదూరంగా ... నా చెవుల్లో తేనె చిలికిస్తూ ''తేనేండీ, తేనే!''

ఒళ్ళు జల్లుమంది. బయటికొచ్చి నిలబడ్డాను. నాకు నిరాశే ఎదురయింది. వచ్చేది ఆ ముసలాడు కాదు. ఎవరో ముసల్ది. అరవై యేళ్ళుంటాయేమో! నడుం వంగిపోయింది. ముగ్గుబుట్టలాంటి తల.

'ఆ గొంతులో అదే విరుపు ... ఎలా సంభవం?' ఆలోచిస్తూ వెనుతిరిగాను.

''తేనె తీసుకుంటారా అమ్మా!'' మళ్ళీ అదే పిలుపు ... అవ్యాజమైన ఆర్ద్రత నొలికిస్తూ ... మనసు పొరలను కదిలిస్తూ అదే జీర!

లోపలికి రమ్మన్నాను.

ఒక సీసా తీసుకుంటూ అడిగాను — ''ఇదివరలో ఇటో ముసలాడొచ్చేవాడు తేనె అమ్ముతూ. వాడు నీ కేమయినా బంధువా?''

చెముడల్లే వుంది. ఇంకోసారి గట్టిగా అడిగాక చెప్పింది ''ఆ ... మా మావ తల్లీ!''

అదీ సంగతి!

''ఈమధ్య రావట్లేదేం?'' ఈసారి కొంచెం గట్టిగానే అడిగాను.

ఒక్కసారే ఆ ముడతలు పడ్డ మొహంలో విచార మేఘాలు కమ్ముకున్నాయి. గాజుకళ్ళు నీటి చెలమ లయ్యాయి. వణుకుతున్న గొంతుతో అంది -''ఆర్నె ల్లయిన్ది తల్లీ సచ్చిపోయి ... నా బతుకు బుగ్గి సేసి పోయాడ్తల్లీ'' — ఒక్కసారే బావురుమంది. పాలి పోయిన పెదవులు అదురుతున్నాయి దుఃఖో ద్వేగంతో. ఆమె గాజు కళ్ళల్లోంచి తెగిపడ్డ కన్నీటి ముత్యాలు ఎండిపోయిన గుండెల్లో ఇంకిపోతున్నాయి.

గుండెల్ని పిండినట్టయింది. నాకు అయాచితంగా ఆనందాన్ని ప్రసాదించే గొంతు శాశ్వతంగా మూగ పోయిందని తెలిసి ఎలాగో అయిపోయాను.

నేను తేరుకోడానికి అయిదారు నిమిషాలు పట్టింది.

సన్నగా రోదిస్తూందామె. ఆమెను సముదాయించే సరికి మరో అయిదు నిమిషాలు దొర్లాయి.

అడిగాను — ''మరి ఈ వయస్సులో నీకిదేం ఖర్మ? పిల్లలు — కొడుకుల్లేరా?''

చటుక్కున తలెత్తిందామె. "ఆడదాయి కొం గట్టుకు తిరిగే ఆడు నా కొడుకా ... థూ" నిరసనగా అందామె. పైకి చూస్తూ "ఆ మారాజే నన్నన్యాయం సేసి నాకీ తల్రాత రాశాడు ... ఎవుర్నన్నేం నాబంలే తల్లీ" గాజు కళ్ళల్లోంచి దీనత్వం ఉట్టిపడుతోంది.

జాలేసింది.

నవ్వుట్టుకుని ... "ముసిల్దానా, తేనమ్ముకు(బ)తాయే కూడెడతా నంటాడా ... ఇంతకన్నా అన్యాయం వుంటదా తల్లీ" కళ్ళెత్తి నాకేసి బేలగా చూసింది. కళ్ళల్లో తడి జీర.

గోడ ఆసరా చేసుకుని లేస్తూ అంది— "ఈ పెత్తనానికి ... ఇట్టా ఈదీదీ తిరుగుతూ ... హు ..."

లోనికి వెళ్ళి పైసలు తీసుకువచ్చాను.

అతి కష్టం మీద లెక్క పెట్టుకోగలిగింది. 'కళ్ళు గూడా సరిగ్గా కనపడవేమో పాపం!'

నా కళ్ళు సజలాలయ్యాయి. 'అనుబంధాలూ, సెంటిమెంట్స్ అంటూ బోర విరుచుకునే మన పవిత్ర భారతదేశంలో వయసు మళ్ళినవారికి సమాజ మిచ్చే కానుకా ఇది? ఆ కొడుకు ఆగడాన్ని ఎందుకు అరికట్టలేకపోయిందీ సమాజం? అవును ... నీతీ, అంతఃకరణా మృగ్యమైన ఈ కుళ్ళు వ్యవస్థ ఒక దీనురాలయిన ముసలి తల్లికి ఇంతకన్నా ఏమి ప్రతిఫల మివ్వగలదు గనక?!'

మనసంతా చేదు తిన్నట్టయింది.

గేటు దాటిందామె. హృదయాంతరాళంలో మారుమోగుతూ సన్నగా, జీరగా, వణుకుతూ "తేనెండీ ... తేనె" కేక క్రమక్రమంగా నాకు దూరమవసాగింది.

*     *     *

సంక్రాంతి మరుసటి రోజు ...

లోపల ఏదో పనిలో వున్నాను. ఉదయం తొమ్మి దయింది.

సుపరిచితమైన కేక "తేనె తీసుకుంటారా అమ్మా!"

బయటికి వచ్చాను చేతులు కొంగుకు తుడుచు కుంటూ.

గేటు తీసుకుని లోపలికి వచ్చి అరుగు మీద చతికిలబడ్తూ అంది — "పండగ పప్పన్నం ఎట్టేంచు తల్లీ" కళ్ళల్లో అర్థింపు, ఆకలి!

పాపం, కొడుకు అన్నం గూడా పెట్టలేదేమో!

ఒక విస్తట్లో పండగకని చేసిన పిండివంటలూ, అన్నం, కూరలూ సర్ది తీసుకువచ్చి ఆమె ముందుం చాను.

"ఇదెందుకమ్మా! సిన్న గిన్నిలో ఎట్టు తల్లీ, ఇంటికెల్లి తిని గిన్ని మల్లీ బద్రంగా రేపట్టుకొత్తాగా."

నిర్ఘాంతపోయాను. "ఇక్కడ తినరాదూ! ఇంటి దగ్గర నీ కొడుకు నిన్ను తిననిస్తాడో లేదో!"

తలెత్తి చూసిందామె! చూపులో నా కర్థంగాని కోటి భావాలు తళుక్కుమన్నాయి. "ఆడు నన్నెంత సీదరించుకుంటేనేం, ఆడి కెట్టకుండా పప్పన్నం నేన్తినగల్నా తల్లీ!" అన్నది మెల్లిగా. ◆

---



పేషంట్

అతి మినీ స్కర్ట్‌తో వచ్చిన సెక్రటరీకి లాస్ట్ వార్నింగ్ ఇచ్చాడు యజమాని.

"ఇదిగో అమ్మాయ్, ఇంతకు మించి మినీ స్కర్ట్ వేసుకుని రావద్దు. నేను అసలే హార్ట్ పేషంటుని." — ఇ.వి. రమణ

